# కుక్క

**పూ**ర్ణచంద్రుడు వచ్చాడు– శశిరేఖ ఏది? వెయ్యి చుక్కలు వచ్చేయి, రేవతి ఏది? సోన హెడ్డీ– సోన బేగం ఎవ్వరూ లేరు; అంతా ఊళ్ళకి వెళ్ళిపోయేరు, తనొక్కడే వుండిపోయేడు. తనూ వెళ్ళిపోతాడు. ఎమ్మెస్ ఐపోతే– ఇంకో ఇరవై రోజుల్లో– జీవితంలో పాతిక ఏళ్ళు గడిచాయి. కాని ఈ ఇరవైరోజులూ గడవటమెలా?

అరవిందుకు ఏం లేకపోయినా కష్టం వుండదు. కాని పరిచయం లేని అమ్మాయి లేకపోతే మాత్రం దినం గడవదు.

అతను సిగరెట్లు కాల్చడు. స్నేహితులు బలవంతం చేస్తేనే ఎప్పుడేనా కాఫీగాని, హాట్ డ్రింక్స్‌గాని త్రాగుతాడు. అతను ప్యూర్ శాఖాహారి. అతనికి దేముడిలోనూ, పద్ధతి ప్రకారం స్థాపించబడ్డ ప్రభుత్వాలలోను, నమ్మకం వుంది. అతనికి కొట్లాట అంటే అసహ్యం. యుద్ధం అంటే పరమ అసహ్యం.

మనుషుల పూర్వ సుకృతాలనుబట్టి సర్వేశ్వరుడు సంఘంలో స్థానాలు ఏర్పడుస్తాడు. ఏ కొద్దిమందికి మాత్రమో పై మెట్టుకు పోవడానికి దేవుడు చెయ్యి అందిస్తాడు, వాళ్లే పైకి పోవాలి. వాళ్ళే పుణ్యాత్ములు.

ఉదాహరణ తనే.

పాత ఫోటోలో మనిషిలాంటి అమ్మ– పిడకలు పెట్టింది. పుణుకులు అమ్మింది. పాలు అమ్మింది, అప్పుడు జీవితం ఒక పీడకల.

ఊరి అవతల ఏపుగా ఎదిగిన చెదపుట్టలాంటి పూరిల్లు– తెగిన నరాలతో అల్లినట్లున్న నులక మంచంలో పడుకున్నప్పుడు సజీవంగా కప్పేస్తున్నట్లున్న కంచుమూతలాంటి పైకప్పు ..... నిప్పు మొగ్గలాంటి నూనెదీపం చలించినప్పుడల్లా రక్తకెరటాలు తెర్లుతున్నట్టు కదిలే ఎర్రచీకటి నీడలు– బైట చేతికి తగిలేకాల నాగు పెనుబుసలాంటి చీకటి గాలి చల్లదనం పులి బగ్గీలలా పండని పొలంలో దున్నిన గీతలు– చేట పెయ్యకు పాటు చేతలేని గేదె కన్నులలోతు– చనిపోయిన చెల్లి చివరిమూలుగులా పై కప్పులో గాలిచేసే ధ్వని.....

"నేను ఏమైనా భరిస్తాను, నా కాళ్ళు తీసినా కళ్ళు పీకీ– నీను ఏ కొరతైనా భరిస్తాను. కాని నన్ను ఈ బీదరికపు పాపపు పాశాల్నుంచి– ఈచలి గుహల జబ్బు మూలుగుల నుంచి – ఈ విషపునాగుల పెనుసుళ్ళ నుంచి–ఈ గరళపు గోడల విషపు నీడనుంచి రక్షించు, ఈ నిస్సహాయత నుంచి కాపాడు" అని అమ్మ చనిపోయిననాడు ఊరవతల అమ్మవారిని ఎంతో భక్తితో ఎంతో విశ్వాసంతో ప్రార్థించేడు.

అతని దీనాలాపన అమ్మవారు వింది. విని చిన్నప్పుడే రంగం పారిపోయిన తన మేనమామని పంపించింది.

తనకు ఒక్కడే మేనమామ, ఆ మేనమామకి ఒక్కతే ముండ. ఆ ముండకి ఒక్కతే కూతురు. ఆ తర్వాత ముండగ్గాని మామగ్గాని మరి పిల్లల్లేరు.

మేనమామ అప్పలస్వామి చిన్నప్పుడే రంగం పారిపోయేడు, అక్కడ అతను కూలీయే చేసేడో ఖూనీలే చేసేడో తెలియదు కాని అతను తిరిగొచ్చేసరికి పెట్టెనిండా డబ్బుంది. గుండెనిండా ఆత్మవిశ్వాసంవుంది. మూడు మైళ్ల ముందాలోచన వుంది.

అతను కావాలనుకుంటే చెయ్యిర్మెన్‌ని చప్రాసీ చెయ్యగలడు, చప్రాసీని చెయ్యిర్మెనే చెయ్యగలడు. ఎదుటి పార్టీ లీడరు కొడుక్కి కాళ్ళు చేతులూ విరిపిం చెయ్యగలడు. వాడు కేసు పెడితే "ముండింటినుంచి గోడగెంతుతున్నప్పుడు అవి విరిగి పోయేయి" అని పదిమంది ఘరానా మనుషుల చేత సాక్ష్యం చెప్పించి మూడు కోర్టులనూ నమ్మించెయ్యగలడు.

కాని ఆ సరోజ గుంటకి సరిఅయిన మొగుడ్ని "మొగుడంటే యిలాటలాటి అల్లాటప్పయ్యగోడు కాదు" తేలేమోనన్న అతని భయం అతనిచేత అరవిందును చేరదీయించింది. అరవిందును కన్నకొడుకులా చూస్తున్నాడు. తనకు లేని చదువు అతనికి చెప్పించేడు.

"ఆ తల్లి సల్లగజూస్తే వచ్చే ఏ డీపాటికి ఆ మూడు ముళ్ళూ పడవా" అనుకునేటప్పుడు" ఆ దురదృష్టం లేని సరోజ గుంట సచ్చిపోనాది."

సరోజ చనిపోయాక అరవిందు మామకి మరీ సన్నిహితుడై పోయేడు. "ఇక కొడుకైనా కూతురువైనా నువ్వే" అని మామ అతన్ని అంగీకరించేడు.

తన మామ ఫిలాసఫీ అతనికెంతో నచ్చింది.

"నాను బతుకంతా జూయిస్సినాను. నా కరదవయిందేటంటే బతగడానిగ్గావొలసింది డబ్బు. డబ్బుంటే కొండమీద్దేవుణ్ని కొంద దింపీవొచ్చు. కోటలో మనుషుల్ని కోటలోనే కొనీవొచ్చు.

నీకు డబ్బుంటే నీ జొరంవెంలాగున్నాదని జడిజీబా బొస్తాడు. నీకుక్క కెలాగుందని కలకటేరొస్తాడు నువ్వే డబ్బులేని ముష్టెదవ్వి ఐతే నీకు కుక్కలదాగ్రుకూడా మందియ్యడు. నీ కెలాగుందని కట్టుకున్న పెళ్ళాంగూడా ఆడగదు.

పెపంచంలో మడుసులు రెండే రకాలు.

పొట్టోళ్ళు, పొడుగోళ్ళు– మంచోళ్ళు సెడ్డోళ్ళు– తెల్లోళ్ళు– నల్లోళ్ళు. దేవుఁణ్ని నమ్మినోళ్ళు– దేవుఁడికి దొరక నోళ్ళు– ఆడోళ్ళు మొగోళ్ళు–ముద్దాయిలూ జడిజీలు – డాట్టర్లు పేషెంట్లు .......

ఈళ్ళంతా కూడా రెండే రకాలు. డబ్బున్నోళ్ళూ– డబ్బు లేనోళ్ళూ–

పెపంచికంలో ఉన్నవి నేయం– అన్నేయం, దరమం– అద రమం, గాదు లాభం– నష్టం.

అసలు దేఁవుఁడు మనుషుల్ని పుట్టించినప్పుడే మద్దెల గిరి గీస్తాడు.

సావుకారుగా పుట్టి, సన్నాసై పోవచ్చుకాని, ముష్టెదవకి మారాజయ్యే యోగం ఉండదు.

అలాగని ఈ బీదెదవలు వూరుకోరు. బీదోడికి నీ మీదె ప్పుడూ కసే. నిన్ను కిందికి లాగేసీ నీ సిమ్మాసనం ఆడెక్కి పోవడానికే ఎప్పుడూ జూస్తాడు.

అంచేత డబ్బున్న నువ్వు బీదోడుకి ఎప్పుడూ దూరం గానే వుండు బగవంతుణ్నైనా నమ్ముగాని బీదోడ్ని నమ్మకు. ఆడ్ని ఎప్పుడూ బారకాసులోనే ఉంచు.

ఆడ్ని కిందమెట్టు మీద ఉంచడానికి నువ్వేటిజేసినా ఆడికి తెల్నీకు.

బైటకుమాత్తరం– బాహటంగా నీ బూమ్మీద పన్నేసుకో. నీ కారుమీదా మేడమీదాకూడా పన్నేసుకో. ఈ పన్నులు కట్నేక పోతున్నానని బీదరుపులరు.

నువ్వు కట్టీ పన్నులమీద గవర్నమెంటు మూడోరాలు నడవదు.

అంచేత బీదోడి తినే కూడుమీద పన్నెయ్. ఆడుకాలిసీ సుట్ట మీద, ఆడు కొనీ అగ్గిపెట్టిమీద, ఆడు వొంటిమీద, ఇంటిమీద, ఆడి పెళ్ళాంకోకమీద, ఆడి కొడుకు మందుమీద పన్నులేసీ, ఆతరవాత నీసోకులు నువ్వుజూసుకో.

బైటకు మాత్తరం నిన్నూ ఆడ్ని ఆ బగవంతుడే పుట్టించేడని అన్నా ఆడుపుట్టనప్పుడు ఆ దేఁవుడు సెలవు మీదున్నాడని సెప్పకు.

బీదోణ్ని ఉంచాలిసిన సోటే ఉంచు"

❖ ❖ ❖

మాఁవఁ అతనికి యిలాటి సలహాలు పెగ్గూ పాలతో పోసేడు. అవి అతనికి ఎంతో నచ్చేయి, వాటిని "తూ.చా" తప్పకుండా అతను పాటించేడు.

అందుకే అతను మోహన మొహంకూడా చూళ్ళేరు. వకుళ వేపేసేనా చూళ్ళేదు. వాళ్ళకి అందంవుంది. చదువుంది. కాని ఏం లాభం? డబ్బులేదు.

అతను బీదవాళ్ళనుంచి సభ్యతకి భంగం లేనంత దూరంగా ఉండిపోయేడు.

అతని తెలివిచూసి మోజుపడ్డారు కొందరాడ వాళ్ళు. అతని డబ్బుకి బానిసలయ్యేరు కొంతమంది. అతని అందానికి ఆహు తులయ్యేరు కొంతమంది. కాని వాళ్ళలో ఐశ్వర్యవంతుల్ని మాత్రమే అతను భరించేడు.

అతను ఫైనల్ ఇయర్‌కి వచ్చేసరికి బంగళా అద్దెకు తీసు కున్నాడు. ఎమ్మెస్సులో చేరగానే కొత్తకారు కొన్నాడు.

ఆ కారూ బంగాళా అతనికి జీవితాంతం గుర్తుంటాయి. వాటిలో ఎన్ని మధురానుభూతులు! ఎన్ని తీపి గుర్తులు!

❖ ❖ ❖

అతనికి ఆ రాత్రి చాలా విసుగ్గా ఉంది. ప్రపంచం అంతా చచ్చిపోయినట్టూ తను ఒక్కడే వెయ్యేళ్ళు బతకాలని భగవంతుడు శపించినట్టూ చాలా బోరింగుగా వుంది.

శశిలేదు, సుశిలేదు, కమల కలకత్తా పోయింది. మీనాక్షి మొగుడు ఊళ్ళోనే వున్నాడు. విశాలకి జ్వరం. దాని మొహం దాని కెప్పుడూ జ్వరమే.

"జ్వరంగా వుంది బాబూ రేపు రాలేను" అంది అతని దగ్గర కొచ్చి మల్లమ్మ. మనసు బైటకొచ్చి మాటాడినట్టు తుళ్ళిపడ్డాడు అతను.

"మరైతే"

"నాకూతుర్ని అంపుతా పన్లోకి"

❖ ❖ ❖

పన్లోకి కూతురొచ్చింది.

అలికిన నేలమీద పెట్టిన రంగుల ముగ్గులా మనోహరంగా వుంది.

ఆమె కళ్ళు పన్నీటి సరసులో పూసిన వింత పూలలా వున్నాయి.

మూత పెట్టిన కుంకుమభరిణలా నిండుగా వుంది ఆమె ముఖం.

మొగలి పవ్వులోపలి రేకులా లేతగా వుంది.

ఆమెకి వయసొచ్చి

వంటికి వళ్ళూ

కంటికి కాంతీ వచ్చేయి.

కొత్త సబ్బుబిళ్ళలా కొరుక్కు తినెయ్యాలన్నట్టు వుంది.

ఆమెకు నగలు లేవు, ఉన్నా అందంలో కరిగిపోయి వుండేవి.

"ఈ అల్పురాలిలో యింత అందమా?" ఆశ్చర్య పోయే డతను.

"నీ పేఁరేవిఁటి?"

"రాజమ్మ?" మువ్వలు జల్లినట్టు నవ్వింది.

❖ ❖ ❖

ఆమెను చూసిన దగ్గర్నుంచీ అతని ఎముకల్లో పీకు ప్రారంభమయింది.

అతని మనసు బ్రహ్మాండమైన సమస్య పళ్ళచక్రాల మధ్య తెగిపోతున్నాది.

జీవితంలో తొలిసారి ఒక అభాగ్యురాలు అతన్ని ఆకర్షించింది.

ఇంత అందం వదులుకోవడం ఎలా?

"కాని కుళ్ళునీటి పువ్వే?"

ఈమెను కోరుకుంటే మేఘాలమీంచి సముద్రం అడుగున పడిపోవడమే.

అతను అంతవరకూ హైయ్యర్ మిడిల్ కంటె కిందకు దిగజారలేదు.

ఒక రాత్రి

గంధర్వగానం వింటున్నట్టువిలాసంగా ఊగుతున్నాయి ఆవ రణలోని కొబ్బరిచెట్లు.

వాటి ఆకులు గలగల నవ్వుతున్నాయి.

దశమి వెన్నెల వెండిలేసు జోళ్ళతో కిటికీలోంచి హాల్లోకి వచ్చేసింది.

దూరాన సముద్రం ఉద్రేకంతో ఉరకలు వేస్తూంది.

కిటికీ లేసు తెర, ప్రియురాలి పైటలా ఎగురు తూంది.

దూరాన రెండు కార్ల హారన్లు ప్రేయసీ ప్రియుల సాంకేతిక సంభాషణలా వినిపిస్తున్నాయి.

కిటికిలోంచిపడ్డ వెన్నెల విలాస భూగృహం వెండి ద్వారంలా వుంది.

మూలనున్న టేబుల్ లేంప్ చీకట్లో విరిసిన కలువలా ఉంది.

మీదనున్న సీలింగ్ ఫేన్ ప్రేమపాట 'హం' చేస్తున్నది. వాస్తవం కల ఒడిలో ఒరిగిపోయింది. చక్కని చుక్కలు చల్లగా పాడేయి. మనసు మసాలాముద్ద నూరుకుంది. కోరిక పాము కోరల పట్టుకారుతో మనసుని పీకింది.

ఆమె మోహం అతను చేతుల్లోకి తీసుకున్నాడు. వెన్నెల కరిగిన పన్నీరు దోసిట్లోకి తీసుకున్నట్టయింది ఆ రాత్రి కుళ్ళు నీటి పువ్వే జయించింది.

పువ్వల్లే నవ్వింది ఆమె.

వానల్లే ఉరిమేడు అతను.

పిల్ల ముత్యంలా వుంది. పిట్టలా పాడింది. పాములా ఆడింది. పాలలా పేరుకుంది. అలలా కరిగిపోయింది.

❖ ❖ ❖

అలాటివి పదే రాత్రులు.

కాని దేముడికి కన్ను కుట్టింది

వెన్నెల శాపం వచ్చి నల్లబడిపోయేయి రాత్రులు.

❖ ❖ ❖

డాక్టర్ అరవింద్ యం.యస్. స్వంత వూరు వెళ్ళిపోయి ప్రాక్టిసు పెట్టేడు. మల్లమ్మని పట్టుకున్న రోగం వదల్లేదు. నెలలోనే ఆమె చచ్చిపోయి కూతురి కడుపున పడింది.

కూతురేమైంది?

ఆమె డాక్టరు ఎడ్రసు కనుక్కుని "మనిద్దరి మధ్యా సంఘం అఘాతాలు సృష్టించింది. నన్ను పెళ్ళాడమని కోరుకోను. కాని

నాకు పుట్టబోయే బిడ్డ తండ్రిగా నీ పాదసేవ చేసుకుంటూ నీ పంచని పడుండనీ" అని బతిమాలుకోలేదు.

అసలు ఆమెకు డాక్టరుది ఏ ఊరోకూడా తెలియదు.

అంచేత ఆమెకు–

డాక్టర్ అరవింద్‌తో పాటు జగ్రికాళ్ళకోరిక– సెకండ్‌షో సినిమా నీడలో నలిగిన పూదండా–వర్షం రాత్రి వెచ్చదనంలో రెండోసారి జారిన కాలూ పడిన కాలువలోంచి కుళ్ళిన కుళ్ళూ కూడా జ్ఞాపకమున్నాయి.

ఆమెని ఏ రాత్రి అయినా బస్సులమధ్య చీకట్లో స్టేషనురోడ్డు నీడల్లో, సినిమాహాలు కీనీడల్లో చూడొచ్చు.

ఆమె

ఊరవతల గుడ్డివెన్నెల్లో పెనుపుట్టల్లా లేచిన గుడిసెల్లో చివరిదాన్లో వుంటుంది.

ఆమె యింటిచుట్టూ చేతులు చాపిన చీకట్లా విస్తరించిన వృక్షం వూడలు ఉరితాళ్ళలా వేలాడుతూ ఉంటాయి.

ఆమె యింట్లో వెలిగే నూనెదీపం.... అప్పుడే భర్తను పోగొట్టు కున్న స్త్రీ మొహాన్ని బొట్టులా చూడ్డానికి బాధగా వుంటుంది.

ఆ యిల్లు చీకటికే అంకితం అయినట్టూ, కాలనాగు చుట్టల మధ్య కారుచీకట్లే ఆ కొంపకి సహమైనట్టూ వుంటుంది.

ఆ గుడిసెల్లోని మనుషులు చావు క్రీనీడల్లా నల్లగా అర్భకంగా వుంటారు. వచ్చే జన్మలోనైనా సుఖిస్తాం అన్న నమ్మకం; కోరికా వాళ్ళ కళ్ళల్లో ఎక్కడా కన్పించదు. వాళ్ళ పసిపిల్లలు పందిపిల్లల్లా ముద్దొస్తూవున్నా, కాస్త పెద్దపిల్లలు తోడేళ్ళు పెంచిన పిల్లల్లా అసహజంగా వుంటారు. వాళ్ళ ఏడుపులు ఆకలి పేగుల అరుపుల్లా వుంటాయి. కొండల్లోపుట్టి గుహల్లో పెరగవలసిన వింత మృగాలు దారితప్పి నాగరిక ప్రపంచంలోకి వచ్చినట్టుంటారు వాళ్ళు.

❖ ❖ ❖

రెండు సంతవ్సరాల్లో డాక్టర్ విశ్వనాథం ఏకైక పుత్రికనిచ్చి డాక్టర్ అరవింద్‌కి వెంకటేశ్వర సన్నిధిలో అతివైభవంగా వివాహం చేశారు. ఆ తర్వాత అరవింద్ మామగారింటి కొచ్చే శాడు. అది అతను చదువుకున్న వూరే.

"విశాల, సుశీల ఊరు" అని లోపల్లోల నవ్వుకున్నాడు అరవింద్. రాజమ్మ వూరుకూడా అదేనన్న సంగతి అతను గుర్తుకు తెచ్చుకోలేదు.

ఆ తర్వా పదేళ్ళపాటు అల్లుడూ, మామా కలిసి క్యాను కడుపూ, తియ్యని కడుపూలేదు. వాళ్ళ ఆర్జనకి యినప్పెట్టెలు పగిలిపోయేయి. వాళ్ళ క్రింద అరడజను మంది అసిస్టెంట్లు, ఇరవయిమంది నర్సులు, పదిమంది మంత్రసాన్లు పని చేస్తు న్నారు. వాళ్ళు ఊరవతల నర్సింగ్ హోం కట్టుకోవడానికి బంజరు భూమి పట్టా పుచ్చుకున్నారు.

ఒక బంగారు ఉదయాన,

బాలభానుడు బంగారు దుస్తులు విప్పకుండా వున్నప్పుడు,

ఊరంతా చల్లగాలి కన్నతల్లి చూపులా చల్లగా వీస్తున్నప్పుడు,

కనువిప్పిన పసిపాప తల్లి మొహం తనవేపు తిప్పుకొని నవ్వే వేళ;

కదులుతున్నవి యినపకోటల్లాంటి మూడు బుల్ డోజర్లు ఊరవతల వున్న గుడిసెల్ని దున్నేసేయి. దగ్గరుండి నేలమట్టం చేయించేరు రక్షక భటులు.

కన్నకూతురి అస్తికలు యేరుకున్నట్లు పవిత్రంగా ప్రేమగా పదిలంగా ఏరుకున్నారు చిదిగిపోయిన పుల్లల్నీ కర్రల్నీ అక్కడి వాళ్ళు.

"బాబ్బాబు! మమ్మల్ని మంటకలిపేకండి" అని చేతులెత్తి ప్రార్థించేరు ఎక్కడి ప్రజ. ఎత్తినచేతులు దించకపోతే విరిచేస్తా మన్నారు అధికార్లు. ఇంకా దిగన చేతులికి సంకెళ్ళు వేసేరు రక్షక భటులు.

రెప్పపాటులో గుడిసెలు నేలమట్టం అయిపోయేయి.

"రాజమ్మ సచ్చిందేవేఁ, అదురుష్టమంతురాలు. దాని గుడిశ పక్కనంబర్లో వుండిపోనాది"

రాజమ్మ ఒక కంట నీరూ, ఒక కంట నిప్పూ కక్కింది.

మరు సంవత్సరం రాజమ్మ గుడిశ పక్కనే "పంకజం నర్సింగ్ హోం" వెలిసింది. దాని ఆవరణలో డాక్టర్ విశ్వనాథ్ స్మారక చిహ్నంగా అతని కంచు ప్రతిమ ప్రతిష్ఠించబడింది. ఆ విగ్రహం కంచు కళ్ళు యెదురుగా ఆరంతస్తుల నర్సింగ్ హోంని గర్వంగా ప్రేమగా చూస్తున్నట్టుంటాయి. ఆ నర్సింగ్ హోంని గర్వంగా ప్రేమగా చూస్తున్నట్టుంటాయి. ఆ నర్సింగ్ హోం పగలు చూస్తే పాలరాతితో కట్టినట్టుంటుంది; రాత్రి అద్దాల మేడలా వుంటుంది.

ఆ ఆవరణలోనే డాక్టరు అరవిందుకీ, మరో ఇద్దరు డాక్టర్లకీ, ఇంకా ఇతరులకీ బంగళాలున్నాయి.

రాజమ్మకి ప్రపంచం మంచితనంలోనూ, దేవుడి నిండు దయలోనూ ఏమాత్రం నమ్మకం తగ్గలేదు. అసలు తనకు జీవితంలో ఏ అన్యాయం జరగలేదనే నమ్మకంతోపాటు, తను అంత కంటే ఎక్కువ అంతస్తుకి తగదనే విశ్వాసం కూడా వుండడంవల్ల, ఆమె లోపల ఎంతగుట్టయిపోయినా పైకి నిండుగానే వుంటుంది.

ఆమె ప్రతి శుక్రవారం ఆలయానికి వెళుతుంది. ప్రతి శని వారం ఉపవాసం వుంటుంది. దేవుఁణ్ని చూసినప్పుడల్లా "బాబూ! మణులూ, మాన్యాలూ అడగను. భూములూ బంగారం అసలేవద్దు. నా కూతురు పది కాలాలపాటు పసుపు రాసుకు బతుకుతే చాలు. పెళ్ళి ముగ్గుతొక్కే భాగ్యం దానికేనా యియ్యి. నా బతుకెలాగూ బుగ్గయిపోనాది. నానే నా సేతుల్తోనే కాల్చీసు కున్నాను. దాన్ని బాగుసెయ్యొద్దు. సెయ్యమని కూడా నేనడగను. నే నడిగేదల్లా ఒక్కటే. నా బతుకులాంటి బతుకు మాలచ్చి గుంటకొద్దు. దాన్ని సల్లగా సూడు" అని ప్రార్థించేది. ఒక్కోసారి ఆ రాతిదేవుడు తన ప్రార్థన విన్నట్టు ఫీలై పొంగిపోయేది.

మాలచ్చి గుంటకి పదేళ్ళు. స్టూడెంట్ల లాడ్జీలు తుడుస్తుంది. వాళ్ళకి కేరియర్లు తెస్తుంది. తల్లికి వండుతుంది. తల్లి దగ్గరకొచ్చే సరసులకి సారా తెస్తుంది. దాని కా వయసుకే సృష్టిరహస్యాలన్నీ అర్థమైపోయేయి.

ఒకనాడు మహాలక్ష్మి తల్లీ కలిసి ఊళ్ళోకి బైల్దేరేరు. సాయంత్రం చుక్కలు "యింత తొందరగా చీకటైపోయిందా" అని అప్పుడే మొహాలు కడుక్కొని మెరుస్తున్నాయి.

నర్సింగ్‌హోం దాటి రెండు ఫర్లాంగులు వచ్చేరు వాళ్ళు. ఒక వీధిలైటుకింద పెద్ద అమెరికన్కారు ఆగివుంది. దాని ఎత్తిన బోనెటు తెరిచిన పులినోరులా భయంకరంగా వుంది. దాని ముందు యింజన్లోకి వంగి రిపేరు చేస్తున్న డ్రైవరు అరమనిషిలా వున్నాడు.

రాజమ్మా మహాలక్ష్మీ లైటుకింద కొచ్చేరు. రాజమ్మ ఆగి నవ్వింది. రాజమ్మని చూడగానే కారులో కూర్చున్న డాక్టరు అరవింద్‌కి తను క్రిందటి జన్మలో చంపి పాతేసిన మనిషి దయ్యమై తిరిగొచ్చి తననిచూసి నవ్వుతున్నట్టనిపించింది. ఆమె ప్రక్కనున్న మహాలక్ష్మిని చూడగానే, ఏదో వూళ్ళో కాన్వెంటులో వున్న తన పెద్దకూతురు మిల్లీని అన్నం లేకుండా ఎండబెట్టి జుత్తుపీకేసి, గౌను చింపేసి, నడిబజారులో నిలబెట్టినట్టు భయ పడి అనుకోకుండా కారుదిగేడు. రాజమ్మా అతనూ ఒకర్నొకరు పోల్చుకున్నారు. రాజమ్మ మధురస్మృతిలా నవ్వింది. అతని మొహాన్ని బెడ్‌సైడ్ మేనర్సుకోసం అంటించుకున్న కృతిమమైన చిరునవ్వు కాలుతున్న మంటలో మాడిన లేత మొగ్గలా మండి మసైపోయింది.

రాజమ్మ నిద్రలో నడుస్తున్న మనిషిలా చీకట్లోకి నడిచి వెళ్ళి పోయింది. ప్రక్కనున్న పిల్లకూడా ఆమెకి చాలాసేపు గుర్తులేదు. గతం గోడమీద ఏదో అందమైన చిత్రం కదిలినట్టయి ఆమెకు ఏడుపూ, నవ్వూ ఒక్కసారి వచ్చేయి.

అరవింద్‌కి తనచుట్టూ వున్న భూమి పగిలిపోయినట్టూ అతనొక్కడే ఒక విషపుగడ్డమీద వంటరివాడై పోయినట్టూ అనిపించింది. అతని పక్కనున్న టెలిగ్రాపు తీగెలుకి రెక్కలు తెగిన పక్షిలా యీదురుగాలి మూలుగుతోంది.

అతని నర్సింగుహోం లైట్లు అతి దూరంగా కన్పిస్తున్నాయి. తనా నర్సింగుహోం చేరలేనట్టూ. అతన్ని ఏదో చీకటిగుహలో ఎవరో నేలకి మేకులతో బిగించేసినట్టూ ఫీలై ముందుకు నడవ బోయినా అడుగు పడలేదు. పది జన్మలకిందటి పాపం ఏదో తనని ఎముకలచేత్తో బలవంతగా తనవేపు లాగుతున్నట్టూ, తను కాదనలేని నిస్సహాయుడూ, నిర్బలుడూ అయిపోయినట్టూ అన్పించిందతనికి.

నిలబడలేని అతను అంతస్తుకూడా మర్చిపోయి పక్కనున్న మదుముమీద కూలబడిపోయేడు. జేబులో సిగరెట్టుంది. కాని లైటర్‌లో పెట్రోలులేదు "ఛ! డ్రైవర్ని అడగడమా?" ఊరుకున్నాడు.

రెండోవీధి లైటు చేరిన రాజమ్మ వెనక్కి తిరిగి చూసిన చూపులో కోరికా, దీవనా లేవు.

"యింజనందుకుంది సాబ్" డ్రైవర్ అన్నాడు. ఆమె మీద నుండి చూపు మరల్చి స్టీరింగుదగ్గర కూర్చుని కారుస్టార్ట్ చేశేడు డాక్టరు అరవింద్. పాముపిల్లలా పరిగెత్తింది కారు ఆ కారు నడుపుతున్నప్పుడల్లా అతనికి తన జీవితాన్ని తనక్కావలసినట్టు మలుచుకుంటున్నా నన్న ఆత్మవిశ్వాసం, మలుచుకోగలనన్న ధైర్యం ఎంచేతో ఎప్పుడూ వస్తాయి.

❖ ❖ ❖

ఓ రాత్రి అనుకోనంత తొందరగా యింటికి వచ్చేసిన రాజమ్మకి టీ దుకాణం నాయరు వళ్ళో వున్న మహాలక్ష్మి కనిపిం

చింది. తప్పు నాదికాదన్న చూపు విసిరి వెళ్ళిపోయేడునాయరు. ఆరాత్రి మహలక్ష్మిని కసితీరా చావబాదిన తర్వాత రాజమ్మ కూతుర్ని కావలించుకుని ఏడ్చింది. తనలా అవొద్దని బ్రతిమాలింది. అలా చెయ్యొద్దని దేవుడ్ని మరోసారి ప్రార్థించింది.

మహలక్ష్మిని టీ దుకాణంవాడి తర్వాత యిద్దరు స్టూడెంట్సూ, తర్వాత బస్ కండక్టరూ, బడ్డీకొట్టువాడూ మోసం చేశారు.

రాజమ్మ ప్రార్థన విన్నట్టే కనిపించి మోసం చేసి గుళ్ళో దేవుఁడుమాత్రం ఏమీ మోసం చెయ్యనట్టు రాతినవ్వు నవ్వుతూనే వున్నాడు చీకటి గుడిశెలోంచి, చెట్లు ఆకుల నీడల్లోకి, వీధిలైట్ల క్రీనిడల్లోనే ప్లాస్టిక్ పువ్వులా తల్లితోపాటు కూతురుకూడా వెళ్ళడం ప్రారంభించింది.

❖ ❖ ❖

"హేపీ బర్తుండే టు యూ" అని "యూ" ని మూడు మైళ్ళు సాగదీసి పాడుతున్నాడు. అందరిమధ్యా "మిల్లీ" కొవ్వూ పింగాణీ కలిపి చేసిన బొమ్మలా నవ్వుతూ నిల్చుంది. చుట్టూవున్న ఆమె ఫ్రెండ్సంతా ఆడా, మగా టైట్ పాంట్సులో వున్నారు. మల్లీ మాత్రం చీరంతా జరీవున్న బెనారస్ చీరలో వుంది. ఆమె ముఖం బంగారు వేజులోగుచ్చిన వెండిపువ్వులా మెరుస్తోంది.

పాట అయిపోయింది. ఒక్కగుక్కలో కొవ్వొత్తులన్నీ ఆర్పేసింది మిల్లీ పట్టుపాము కళ్ళల్లా మెరుస్తున్నాయి ఆమె కళ్ళు. దూరాన్నుంచి ఆదిదంపతుల్లా ఆశీర్వదిస్తూ నిల్చున్నారు నవ్వుతూ ఆమె తల్లిదండ్రులు.

హాలంతా ఖరీదైన సిగరెట్టు పొగతోను, సెంటువాసనలతోను మత్తెక్కిపోయింది. ఆహాల్లో వున్న రంగు రంగు లైట్లన్నీ ఆడవాళ్ళ నగల్లోను, మగవాళ్ళ టెర్లిన్ సూట్లు మడతల్లోనూపడి యింద్ర ధనుస్సు రంగుల్లో మెరుస్తున్నాయి. ఆ హాలునిండా చిన్నా; పెద్దా, ఆడా, మగా చాలామంది వున్నారు. చిన్నవాళ్ళంతా పెద్ద వాళ్ళులాగా పెద్దవాళ్ళంతా చిన్న వాళ్ళలాగా వుండడానికి చేసే ప్రయత్నాల వల్ల వాతావరణంకి కృత్రిమ అందం వచ్చింది.

రాత్రి పదకొండుకొట్టి పదినిమిషాలైంది. అందరిచేతుల్లోనూ హాట్‌డ్రింక్స్ పట్టుకున్న పెద్ద వాళ్ళంతా హుషారుగా కబుర్లు చెప్పుకుంటున్నారు ఓమూల చేరి. చిన్నవాళ్ళు ఎల్.పి. రికార్డులు వేసుకొని డాన్సు చేస్తూ మత్తెక్కి పోతున్నారు. ఆ హాలొక్కటే చూసిన విదేశీయలెవరూ భారతదేశం బీదదనలేరు.

భారతదేశం బీదదని రుజువు చెయ్యడానికేనన్నట్లు ఆ హాల్లోకి రాజమ్మ పెద్దపులి తరుముకొస్తున్నట్లు పరుగెత్తుకొచ్చి డాక్టరు అరవిందు కాళ్ళమీద పడి పోయింది.

"రచ్చించుబాబూ రచ్చించు నా కూతుర్ని రౌడీ ఎదవలు పొడిసినారు, వళ్ళు తెలకుండా పడిపోనాది కూతురు. నువ్వొచ్చి దాన్ని బతికిస్తే గాని నీపాదలొగ్గం" అంటూ అతని పాదాలు విషపు తీగలా చుట్టేసింది.

డాక్టర్ అరవింద్ వస్తాననీ, రాననీ అనలేదు. తను మాట్లాడ గలనన్న విషయం మర్చిపోయేడతను. కాని హాలులో వున్న మిగిలిన వాళ్ళంతా చూపుల్తో "రాడు" అన్నారు. ఇంత ఖరీదైన పార్టీ మూడ్‌ని పాడుచేసిన నేరానికి రాజమ్మని వాళ్ళు క్షమించలేక పోయేరు.

"ది సిల్లీ బిచ్ హౌ ప్రిజెంప్చువస్"

"బట్ డాడీ, యిటీజ్ యింపాజిబుల్" అంది మిల్లీ డాడి పక్కకొచ్చి చెయ్యిపట్టుకొని "ఇంతమంది జవాన్లను తప్పించుకొని ఎలా వచ్చేసేవే ముండా? అన్నట్టు రాజమ్మవేపు చూస్తూ.

"గవర్నమెంటాస్పత్రికి తీసికెళ్ళు" ఎవరిదో ఉచిత సలహా.

"ఆయాసుపత్రి ఆరుమైళ్ళు, అంతసేపు బతకదుబాబూ" అంటూ పొర్లుతున్న కన్నీటిని తుడుచుకోకుండానే బతిమాలింది రాజమ్మ. ఆమె కన్నీరు డాక్టరు జోళ్ళమీదపడి వాటి మెరుపుతగ్గి మరక కట్టింది.

రాజమ్మ అరవింద్ కళ్ళల్లోకి చూసింది. నీరు నిండిన ఆమె కళ్ళకి ఆరుగురు మనుషుల్ని అతక్కుండా చేసిన మర మనిషిలా కన్పించేడతను.

"పేగులు బైటపడిపోనాయ్. పిల్లనిచూస్తే కాదనవ్. ఒక్క సుట్టు రా బాబూ?" తిరిగి వెళ్ళిపోతున్న దేవుఁడ్ని ఆఖరిసారి ప్రార్థించిన పాపిలా ప్రాధేయపడింది. ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. పాపాలన్నీ కొట్టుకొని పోయేట్టు ఏడ్చింది.వింటున్న వాళ్ళు వణికి పోయేలా ఏడ్చింది.

"ఈ వేళే మా ఆఖరు రాత్రి, రేపెలాగూ వెళ్ళి పోతాం. నువ్వెప్పుడూ యింతే. ఎప్పుడూ ఆపరేషన్లు, ఇంజక్షన్లూ .... చూడు మమ్మీ" మమ్మీకి అపీలు చేసింది మిల్లీ.

మమ్మీకి దయామయురాలని పేరు. ఆవిడ నెమ్మదిగా రాజమ్మను లేవదీసింది. వాళ్ళిద్దరూ ఒకరి పక్కన ఒక్కరు నిల్చున్న

ప్పుడు రేవత క్షమిస్తుందో లేదో అన్న కలవరంతో వణుకుతున్న పాపిలా రాజమ్మా, పాపిని క్షమించేనన్న గర్వంతో నిల్చున్న పార్వతీదేవిలా మిసెస్ అరవింద వున్నారు.

"రా, కారులో పంపుతాను. గవర్నమెంటాసు పత్రికి" అంటూ ఆమె రాజమ్మని నడిపించుకొని తీసు కొని పోయి, మళ్ళీ రెండు నిమిషాల్లో తిరిగొచ్చేసింది.

ఆమె మంచితనాన్ని మెచ్చుకున్నారు అక్కడి మంచివాళ్ళు. ఆమె tact ని మెచ్చుకున్నారు వృద్ధిలోకి రావలసిన వాళ్ళు.

బైట రాత్రి మొహం తెగిన మనిషిలా భయంకరంగా వుంది.

ఏం చెప్పినాపార్టీ మూడ్ పాడైపోయింది. అంతచేత వెంటనే భోజనాలకి కూర్చున్నారంతా. ఇంకా మొదటి కోర్సు పూర్తవ నేలేదు.

ఈలోగా మంత్రాన్ని వదలించుకొని వచ్చిన పిశాచిలా రాజమ్మ వచ్చి ద్వారంలో నిల్చుంది.

ఆమె చీర రక్తం మరకలువున్న చోటల్లా చిరిగి పోయినట్టుంది.

ఆమె ఆత్మ చిరిగిపోయిన మనిషిలా ఉంది. ఆమె కళ్ళు గేదెడు రక్తం తాగి ఇంకా కావాలని ఆజ్ఞాపించే అమ్మవారి కళ్ళల్లా జేవురించి వున్నాయి. ఆమె ముక్కు కాటేయబోయే పాము పడగలా ఎత్తుగా పొంగింది. ఆమె కడుపులో మంటకి కన్నీళ్ళు ఆవిరైపోయేయి.

కన్నతల్లినైనా చంపడానికి సిద్ధంగా ఉన్న మనిషిలా పిచ్చి ఆవేశంతో ఊగిపోతూందామె.

డాక్టరు అరవిందని చూడగానే ఆమె అతని వైపు యీనిన పులిలా పరిగెత్తుకెళ్ళి కోటు కాలరు పట్టుకొని ఎముకలన్నీ విరిగేటట్టు గింజింది. అప్పుడు ఆమెను ఆపడానికి అక్కడు వున్న ఎవరూ తెగించలేదు.

"సూడు. బాగా సూడు. నేను నీ 'ఎన్నెల పువ్వుని' 'ఎండిన తీగెని' నన్ను మరిసి పోయిండొచ్చు. కానీ కూతుర్నెలాగ మరిసి పోనావు? దాన్ని పస్తులు పెట్టేవు. పడుసుకోనిచ్చేవు.

మీకాడే నేయం వుంటేనీ పక్కల కూచోనుండాల ఆ గుంటి ప్పుడు. మీకాడే దరమంవుంటే నీ యాస్తిలో వోటా వుండాల దానికి.

కానిమీరుగొప్పోళ్ళు. మీకు నేయంవొద్దు. దరమం వొద్దు. మీరంటే బగమంతుడుకూడా జడిసిపోతాడు.

కాన్నేను బీదముండని. బజారు నంజని. నాకు దేవుఁడంటే బయంవుంది. నేను సచ్చేక 'ఆ బాబు పరువెందుకు బైటెట్టేవ్? అని బగమంతు డడుగుతా డేమోనని బయట పడిపోయి నీ వూసుకి రానేదు. కడుపులు మండిసచ్చినాఁవేఁగాని, కానీ యిమ్మని సెయ్యిజాపలేదు తల్లీ కూతుళ్ళం. కార్లో తిరగాల్సిన కూతురు కారుస్టేండులో పడుసుకుంటూంటే సూస్తూ వూరు కున్నా, మా రాణిని కావాలనే ముష్టిదాన్ని సేసేరు.

నువ్వు దాని బాబువనికూడా తెలనివ్వలేదు.

నా నీతి నాకుంది.

నా దరమం నేన్నిలబెట్టుకున్నాను.

బతికినన్నాళ్ళు పచ్చి మంచినీళ్ళు నిన్నడగ లేదు. కాని సచ్చి నీ పంచనపడుంది. సూసుకో నీ కూతుర్ని.

ఆకిరికి దానిబాబుగా కాకపోయినా, మనిసిగా వొయిద్దెం సేసుంటే అది బతికేది, దారిమద్దెల కుక్కసావు సచ్చీదికాదు.

నువ్వు తండ్రివికావు. రాచ్చసుడివి.

నువ్వు మనిసివికావు మహామారివి.

అని అందామని ఆమెకు ఎంతో అన్పించింది. కాని కిలకిల చుట్టుకుపోతున్న పేగుల్లోని కోరిక చేత్తోపట్టుకొని "సీ! నిన్ను తిడుతే ఓటీ, కుక్కని తిడుతే ఓటీకాదు" అని వెళ్ళిపోయింది.

**(1968)**

# తప్పు

**కో**రలున్న ఈ రాత్రి చిక్కగా నిలబడిపోయింది. సత్యనారాయణ జీవితంలో అనేక రాత్రులు గడిచేయి. కాని ఈ ప్రళయ రాత్రిలో ఒక భయంకరమైన ప్రత్యేకత ఒక అనిర్వచనీయమైన భయం తోడుకొని పేరుకున్నాయి. ఈ భారమైన రాత్రి తొలగిపోవాలి. ఇనప తెరలాంటి ఈ దళసరి చీకటి కరిగి పాలలాంటి వెలుగు ప్రవహించాలి. అప్పుడే సత్యనారాయణకి మోక్షం. జీవితపు చీలిక బాటలమధ్య చేరిన సత్యనారాయణకు ఈ రాత్రే ఒక భావి– ఒక బాట నిర్ణయిస్తుంది. అతని జీవితనౌక ఈ పెను తుఫాను తప్పిం చుకొని దరిజేరడమో, లేక ఈ సుడిగాలిలో విరిగి చెక్కలై పోవ డమో ఈ రాత్రే నిర్ణయిస్తుంది. ఈ రాత్రి నికమోయలే ననుకుం టున్న సత్యనారాయణ చీకటి ఎడారిలో సాగిపోతూనే వున్నాడు.